క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బాధితులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు ఆదివారం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ నెల 12 తేదీ సాయంత్రం ఆలమూరు మండలం చెముడులంక (గాంధీనగరం)లో పేరవు నూకరాజు, మీసాల శంకరంలకు చెందిన రెండు ఇళ్లు ప్రమాదవశాత్తూ నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైన విషయం తెలిసిందే.ఈ ప్రమాదంలో నిరాశ్రయులైన వారికి రూ.3 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు తెలిపారన్నారు. ఈ విషయాన్ని తమ సభ్యురాలు అదే గ్రామానికి చెందిన విజయ తమ దృష్టికి తీసుకువచ్చి సాయం చేయాలని కోరారన్నారు. దీంతో బాధితులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసినట్లు కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈఓ కృష్ణచైతన్య

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నున్న కృష్ణ హనుమంతరావు రూ.11,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. దాతకు ఆలయ ఈఓ చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

హుస్సేనియా అసోసియేషన్ సేవలు ప్రశంసనీయం

మామిడికుదురు: హుస్సేనియా ఎడ్యుకేషన్ అసోసియేషన్ నాలుగు దశాబ్దాలుగా మైనార్టీ విద్యార్థులకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమైనవని జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు సజ్జాద్ హుస్సేన్ పేర్కొన్నారు. మామిడికుదురులో అసోసియేషన్ కోశాధికారి కల్బే ఆబేద్ మాజిం ద్రాణి స్వగృహం వద్ద ఆదివారం జరిగిన సమావేశంలో 1 నుంచి పదో తరగతి వరకు ముస్లిం విద్యార్థులకు నోటు పుస్తకాలు, ప్యాడ్స్, జామెంట్రీ బాక్సు, తదితర వస్తువులను అందించారు. 7, 10 తరగతులతో పాటు ఇంటర్‌లో మండల స్థాయిలో ప్రతిభ చూపిన ముస్లిం విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు, షీల్డులు అందజేశారు.

ఎరుపెక్కిన గోదారమ్మ



అప్పనపల్లిలో పరవళ్లు తొక్కుతున్న గోదావరి

మామిడికుదురు: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల గోదావరికి వరద ఉధృతి ప్రారంభమైంది. నిన్నటి వరకు గోదావరి సాధారణంగా ఉండగా ఆదివారం ఉదయం వరద నీరు చేరడంతో నది ఎరుపెక్కింది. గత ఏడాది జూన్‌లోనే గోదావరికి వరద నీరు చేరింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల ఆలస్యంగా వరద నీరు చేరింది.

తల్లికి కుమార్తె అప్పగింత

రావులపాలెం: మండలంలోని ముమ్మిడివరప్పాడులో ఉంటున్న టి.కళావతి ఈ నెల 14 తేదీ రాత్రి తన కూతురు కోపగించి ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఆమె రాత్రి 9.30 సమయంలో దిశ కాల్‌కు ఫోన్ చేసింది. దీంతో రావులపాలెం ఎస్సై ఎం.వెంకటరమణ అక్కడకు చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసులు బాలిక సెల్‌ఫోన్ నెంబర్ ఆధారంగా లొకేషన్ పట్టుకోగా ఆ బాలిక గంటి పెదపూడిలో ఉన్నట్టు గుర్తించారు. దీంతో ఎస్సై వెంకటరమణ ఆ బాలికకు ఫోన్ చేసి కౌన్సెలింగ్ ఇవ్వడంతో రాత్రి ఒంటి గంటకు బాలిక తిరిగి ఇంటికి వచ్చింది. సుమారు నాలుగు గంటల వ్యవధిలో కోపగించి వెళ్లిపోయిన బాలికను తిరిగి పోలీసులు కన్న తల్లికి అప్పగించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

లంక భూముల పరిశీలన

ఆలమూరు: మండలంలోని బడుగువానిలంకలో గోదావరి కోతకు గురవుతున్న లంక ప్రాంత భూములను సీపీఐ మండల కార్యదర్శి కె.రామకృష్ణ, కొత్తపేట బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు గురప్రు కొత్తియ్య ఆదివారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పరిధిలో 1977లో స్థానిక పేదలకు లంక భూములు సాగు చేసుకునేందుకు డి.ఫారం పట్టాలు ఇచ్చారన్నారు. ఏటా వందల ఎకరాల భూములు గోదావరి కోతకు గురవుతున్నాయని, ప్రభుత్వాలు మారుతున్న నదీ కోత నివారణకు చర్యలు తీసుకోలేదన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి గ్రోయిన్లు నిర్మించి లంక భూములను కాపాడాలని డిమాండ్ చేశారు.

చురుగ్గా రోడ్డు విస్తరణ పనులు

- మొదటి విడతగా పది కిలోమీటర్ల మేర అభివృద్ధి
- అవసరమైన చోట్ల కల్వర్టుల వెడల్పు
- రూ.25 కోట్ల అంచనాతో పనులు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులతో పాటు, పలు ప్రాంతాల ప్రజల రాకపోకలకు అనువుగా ఆర్‌అండ్‌బీ శాఖ అంతర్వేది రోడ్డు విస్తరణ పనులు చేపట్టింది. అంతర్వేది చానల్ ఆనుకుని టేకిశెట్టిపాలెం సెంటర్ వద్ద నుంచి అంతర్వేది దేవస్థానం వరకూ ఉన్న ఈ రోడ్డు విస్తరణ పనులు రెండు దఫాలుగా చేపట్టేందుకు అధికారుల కార్యాచరణ రూపొందించారు. ఇందులో భాగంగా శృంగవరప్పాడు సరిహద్దు నుంచి దేవస్థానం వరకూ 10 కిలోమీటర్ల మేర మొదటి విడతలో రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మలివిడతలో అదనపు గ్రాంటు సమకూర్చుకుని శృంగవరప్పాడు సరిహద్దు నుంచి టేకిశెట్టిపాలెం వరకూ మరో 3.4 కిలోమీటర్ల మేర పనులు చేపట్టాల్సి ఉంది.

ట్రాఫిక్ జామ్ లేకుండా చేసేందుకే..

అంతర్వేది చానల్ వైపు పలు చోట్ల రోడ్డుకు దిగబడి, కోతకు గురవుతూ ఉండడం వల్ల వాహనాల రాకపోకలకు ఎంతో ఆటంకంగా మారింది. దీనికి తోడు ఎదురెదురుగా ఓ మాదిరి వాహనాలకు తారసపడే భారీ ఓఎన్జీసీ వాహనాలను తప్పించుకు వెళ్లే క్రమంలో ఇరుకుగా ఉన్న ఈ మార్గంలో ట్రాఫిక్ గంటల తరబడి జామ్ అవుతోంది. ఈ తరుణంలో భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతూ వస్తున్నారు. ఈ క్రమంలో ట్రాఫిక్ జామ్ లేకుండా చేసేందుకు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఈ రోడ్డు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తిపై స్పందించిన ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ శాఖలో జీఎస్టీ, సీనరేజ్ చార్జెస్, ఎలక్ట్రికల్ పోల్స్ షిఫ్టింగ్ వంటి వాటితో కలుపుకుని రోడ్డు వెడల్పు పనులకు రూ.25 కోట్లు మంజూరు చేసింది.



కేశవదాసుపాలెం సరిహద్దులో అంతర్వేది చానల్‌కు నిర్మించిన రక్షణ గోడ



శృంగవరప్పాడు సరిహద్దు నుంచి కేశవదాసుపాలెం కాలువమొగ వరకూ వెడల్పు చేస్తున్న రోడ్డు పనులు

840 మీటర్ల మేర రక్షణ గోడ పనులు..

శృంగవరప్పాడు రాజీవ్ కాలనీ సరిహద్దు నుంచి అంతర్వేది చానల్‌ను ఆనుకుని శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం, అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం గ్రామాలు ఉన్నాయి. ప్రధానంగా కేశవదాసుపాలెం పరిధిలోని కాలువమొగ సెంటర్ నుంచి దేవస్థానం వరకూ ఇరుకుగా ఉన్న రోడ్డులో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా అంతర్వేది చానల్‌వైపు శృంగవరప్పాడు, కేశవదాసుపాలెం సరిహద్దుల్లో 840 మీటర్ల మేర పకడ్బందీగా రక్షణ గోడ నిర్మాణం పనులను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. ఈ ప్రాంతాల్లో పంట కాలువవైపు రోడ్డు దిగబడడంతో ఈ చర్యలు వారు చేపట్టారు. అలాగే ఆయా గ్రామాల్లో పంటకాలువకు రెండో వైపు కూడా రోడ్డు వెడల్పు చేసేందుకు ఆర్ అండ్ శాఖ తగిన కసరత్తు చేస్తోంది. వీటితో పాటు ఈ మార్గంలో అవసరమైన ఏరియాల్లో కల్వర్టును కూడా వెడల్పు చేసే పనులు యుద్ధ ప్రాతిపదికన సాగుతున్నాయి. శృంగవరప్పాడు నుంచి కేశవదాసుపాలెం వరకూ ప్రస్తుతం ఉన్న రోడ్డును ఎత్తు చేసి అభివృద్ధి చేయనున్నారు. దేవస్థానం వరకూ మిగతా ఏరియాల్లో ఉన్న రోడ్డును యథాతథంగా అభివృద్ధి చేయనున్నారు.

భక్తులకు, ప్రజలకు ఊరట



అంతర్వేది చానల్ వెంబడి విస్తరణ చేస్తున్న అంతర్వేది రోడ్డు పనులతో స్వామి సన్నిధికి వెళ్లే భక్తులకు, ప్రజలకు ఎంతో ఊరట కలుగుతుంది. ఈ రోడ్డు విస్తరణ పనులు వాహనాల రద్దీకి తగ్గట్టుగా ఉపయోగపడతాయి. ఈ మార్గంలో ట్రాఫిక్‌కు ఇకపై అంతరాయం లేకుండా ఉంటుంది.

– రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యే, రాజోలు

జనం మెచ్చిన పాలన జగన్‌కే సాధ్యం

- ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు
- తూర్పుపాలెంలో గడప గడపకూ..

మలికిపురం: రాష్ట్రంలో జనమంతా మెచ్చే విధంగా పాలన సాగించడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందని, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించిన ఏకైక సీఎం జగన్ కీర్తికెక్కారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తూర్పుపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల వివరాలను, అందుతున్న తీరును లబ్ధిదారులను నేరుగా అడిగి ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ అర్హులకు పథకాలు అందకపోతే కారణాలను అడిగి తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని లబ్ధిదారులకు సూచించారు. ఇందుకోసం వలంటీర్లు, సచివాలయ పార్టీ కన్వీనర్ల సాయం తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ప్రభుత్వం అంటే ప్రజల కోసం పని చేయడమేనని నమ్మిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. అందుకోసమే అహర్నిశలూ ఆయన శ్రమిస్తారని అన్నారు. ప్రతి కుటుంబంలోనూ ప్రతి చిన్నారి కూడా ఉన్నత విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాలని ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వాల పనితీరు, ప్రస్తుత సీఎం పనితీరు ప్రజలు బేరీజు వేసుకోవాలని ఆయన కోరారు. గ్రామాలలో ఓట్లడిగే అర్హత ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మాజీరావు, ఎంపీటీసీ ఒగ్గు సుబ్బారావు, గ్రామ శాఖ అధ్యక్షుడు ఆనందం రాంబాబు, అడబాల పద్మ, అడబాల పవన్, నల్లి సత్యం, బత్తుల సంజీవరావు, తాడి శ్రీను, గంటా ఆశీర్వాదం, చింతా రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



తూర్పుపాలెంలో ప్రజలకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

ముమ్మరంగా వరినాట్లు



మొసలపల్లిలో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్న కూలీలు

అంబాజీపేట: నియోజకవర్గ పరిధిలో వరి నాట్లు వేగవంతమయ్యాయి. నారుమడులు సిద్ధం కావడంతో దమ్ములు, వరి నాట్ల పనులు రైతులు ముమ్మరం చేశారు. వ్యవసాయాధికారుల త్వరితగతిన పూర్తిచేయాలని చెబుతున్నారు. ఈ నెలాఖరుతో పాటు, వచ్చే నెలలోనూ నాట్లు పడే అవకాశం ఉంది. ఇరుసుమండ, మొసలపల్లి, గంగలకుర్రు, చిరతపూడి గ్రామాల్లో వరినాట్లు వేశారు. మిగిలిన గ్రామాల్లో వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. కొన్ని గ్రామాల్లో కూలీలతోను, యంత్రాలతోను నాట్లు వేస్తున్నారు. అంబాజీపేట మండలంలో ఇప్పటి వరకు 10 శాతం నాట్లు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సంక్షేమ పాలనను మరోసారి ఆశీర్వదించండి

రావులపాలెం: అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యంగా పని చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని కొమరాజులంకలోని సచివాలయం-2 పరిధిలోని శివాలయం గుడి ఏరియా, ఎస్సీ పేట, మల్లాయిదొడ్డి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమాన్ని వివరించడంతో పాటు సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్ కర్రి గోవిందకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరయ్యారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఎమ్మెల్యే సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి అందిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ వారికి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు కోనాల రాజు, గాడి క్రిష్టాఫర్, గుర్రాల రాంబాబు, సెక్రటరీ నిమ్మకాయల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.



కొమరాజులంకలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్లు ప్రారంభం

రాజోలు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కో-ఆర్డినేటర్ టీఎస్‌వీ పద్మనాభం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పొందవచ్చన్నారు. కళాశాల పనివేళల్లో అధ్యయన కేంద్రం వద్ద వివరాలు కోసం సంప్రదించవచ్చన్నారు.

వంతెన నిర్మాణ పనుల పరిశీలన



ప్రధాన పంట కాలువపై వంతెన శ్లాబు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ఊడిమూడి శివారు చింతావారిపేట, ఉచ్చులవారిపేటల మధ్య ప్రధాన పంట కాలువపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆదివారం పరిశీలించారు. త్వరితగతిన పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ సంస్థను చిట్టిబాబు అభినందించారు. ముందుగా ప్రధాన పంట కాలువపై వంతెన నిర్మిస్తున్నారు. ఇది పూర్తయిన తర్వాత వశిష్ఠ నదిపై వంతెన నిర్మాణాన్ని ప్రారంభిస్తారని చిట్టిబాబు తెలిపారు.

పలువురికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

రావులపాలెం: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన మందపల్లి కల్యాణ్‌కి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని గోపాలపురం ఎమ్మెల్యే స్వగృహం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ సాయాన్ని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్‌తో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

కొత్తపేట: మండలంలోని పలు గ్రామాల్లో పలు బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆర్థిక సాయం చేశారు. వాడపాలెం మారెమ్మ మాన్యం ప్రాంతానికి చెందిన బండారు సంతోష్ ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్నాడు. అతడిని ఎమ్మెల్యే పరామర్శించి రూ.10 వేలు అందజేశారు. వానపల్లి శివారు కోతులతోటకు చెందిన గుత్తుల సాయి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. అతడిని పరామర్శించి రూ.10 వేలు అందించారు.పట్టా రాజు ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను జగ్గిరెడ్డి పరామర్శించి రూ.20 వేలు అందజేశారు. జగ్గిరెడ్డి వెంట అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, బండారు కృష్ణమూర్తి, పెదపూడి శ్రీనివాస్, గొల్లపల్లి శ్రీనివాసరావు, మట్టా బాబ్జి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సాకా జానకిరామరాజు, ఆ గ్రామ పార్టీ నాయకులు ఇసుకపట్ల సునీల్, ఇళ్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



వాడపాలెంలో బాధిత కుటుంబానికి సాయం చేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

వరి సాగులో విత్తనశుద్ధి ప్రధానం

రాజోలు: ప్రస్తుత సార్వాలో విత్తనశుద్ధి చాలా ప్రధానమని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్స్‌పర్సన్ మట్ట శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం రాజోలు మండలం కడలిలో రైతులకు బీజామృతం తయారీ, వరి విత్తన శుద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామంలోని రైతులందరితో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాలలో సహజంగా లభించే వాటితో బీజామృతం తయారీలో మెళకువలు తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది ఐసీఆర్‌పీ ప్రమీల, రఘుపతి పద్మావతి, రవికాంత్ ఆనంద్, వీవోఏ సుమ తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో ఆరోగ్యకరమైన దిగుబడులు

కొత్తపేట: వ్యవసాయ, ఉద్యాన పంటల సాగులో జీవామృతం వినియోగంతో ఆరోగ్యకరమైన అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం వానపల్లి యూనిట్ వ్యవసాయ శాస్త్రవేత్త కె.అరుణ కుమారి తెలిపారు. మండలంలోని బిళ్లకుర్రు శివారు యెలిశెట్టివారిపాలెం మెట్ట వ్యవసాయ క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఆధ్వర్యంలో రైతులకు జీవామృతం తయారు, పంటల సాగులో దాని వినియోగం, ఫలితాలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు యెలిశెట్టి వెంకటేశ్వరరావు, కె.కళ్యాణి, ఎం.సునీత, డి.శ్రీలక్ష్మి, కముజు అనితకుమారి పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

వరదల్లో ధైర్యంగా ఉన్నాం..



గత ఏడాది వరదల కారణంగా మా కాలనీ అంతా నీట మునిగిపోయింది. బయటకు వెళ్లే దారిలేదు. ఆ సమయంలో మాకు కావల్సిన ఆహారం, నిత్యావసర వస్తువులను మా వలంటీర్ కాంగ్రేగుల నాగబాబు తోడుగా ఉండి అన్ని సదుపాయాలు చూసాడు. వరదల్లో చిక్కుకున్న మా కుటుంబాలకు మనో ధైర్యం కల్పించి ఉదయం. సాయంత్రం వచ్చి యోగ క్షేమాలు తెలుసుకునేవాడు. గతంలో వరదలు వచ్చి నీట మునిగినా పట్టించుకున్న నాధుడే లేడు. వలంటీర్‌ల వల్ల మాలాంటి నీట మునిగిన ప్రజలకు అండగా ఉన్నారు.

– తొత్తరమూడి భీమరాజు, వాకలగరువు

వరద ఉధృతిలోనూ సేవలు

ఇతని పేరు బందెల జాన్‌బాబు. అప్పనరామునిలంక సచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు చేర్చడంలో కృషి చేస్తున్నారు. అలాగే ఒకటిన పింఛన్లను ఇంటింటికీ వేకువ జామున అందజేస్తున్నారు. ఆ గ్రామానికి క్రమం తప్పకుండా ఏటా వచ్చే వరదల్లోనూ సాయం అందజేసి అందరి ప్రశంసలు అందుకున్నారు. వరద ఉధృతిలో ప్రభుత్వం సమకూర్చిన భోజనం పొట్లాలను, రక్షిత తాగునీటి ప్యాకెట్లను పడవపై వెళ్లి గడప గడపకు అతను అందజేశాడు.



అప్పనరామునిలంకలో వరద ఉధృతిలో భోజన పొట్లాలను అందజేస్తున్న వలంటీర్ జాన్‌బాబు (ఫైల్)

రేషన్ కార్డు వచ్చింది.. పింఛను వచ్చింది



గత ఆరేళ్ల క్రితం పింక్ రేషన్‌కార్డు ఉండేది. నాకు తెలుపు రేషన్‌కార్డు ఇప్పించమని అడిగినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదు. వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత మా వలంటీర్ చప్పిడి రవికుమార్ మా అవసరాలు తెలుసుకుని తెల్లరేషన్ కార్డు ఇప్పించారు. నేను కార్యాలయాలు చుట్టూ తిరగకుండానే నాకు వృద్ధాప్య పింఛను ఇప్పించాడు. అంతే కాకుండా రైతు భరోసా కూడా వలంటీర్ వల్ల నాకు అందుతుంది. ఇంటికి వచ్చి కావాల్సిన అవసరాలు తెలుసుకుని తీర్చుతున్న వలంటీర్ వ్యవస్థ ఎంతో మహోన్నతమైనది.

– గరిమెళ్ల వీఎస్ సుబ్రహ్మణ్యం, మాచవరం

సింగిల్ కార్డు ఎట్టకేలకు వచ్చింది



గతం నుంచి సింగిల్ కార్డు కావాలని దరఖాస్తు చేసుకున్నా ఎవరూ పట్టించుకోలేదు. వలంటీర్ వ్యవస్థ ఏర్పడిన తరువాత సింగిల్ కార్డు కావాలని చెప్పాను. దాంతో మా వలంటీర్ పితాని సాయిలహరి మా ఇంటికి వచ్చి కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు తీసుకువెళ్లి దరఖాస్తు చేసింది. దరఖాస్తు చేసిన కొద్ది రోజులకే నాకు సింగిల్ రేషన్ కార్డును వలంటీర్ ద్వారా మంజూరయింది. వలంటీర్ వల్ల ఏ కార్యాలయానికి వెళ్లకుండా నేరుగా వారే తీసుకుని వచ్చి పథకాలను అందిస్తున్నారు.

– గెద్దాడ సత్యనారాయణ, ఇసుకపూడి

శాకంబరిగా అమ్మవార్లు

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ శాకంబరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయగోదావరి జిల్లాల ప్రజల ఇలవేల్పుగా విరాజిల్లుతున్న పళ్లాలమ్మ అమ్మవారిని ఆషాఢమాసం ఆఖరి ఆదివారం సందర్భంగా దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, ఈఓ బొక్కా వీరవెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ ఆసాదులు అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, డ్రైఫ్రూట్లతో సుందరంగా అలంకరించారు. శాకంబరిగా అమ్మవారు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో పలువురు పాలకమండలి సభ్యులు, గ్రామ పెద్దలు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్వేదిలో..

సఖినేటిపల్లి: అంతర్వేదిలో కొలువైన గుర్రాలక్క అమ్మవారు ఆదివారం శాకంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారికి స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు ఆధ్వర్యాన అర్చకులు అమ్మవారికి శాకంబరి అలంకరణ చేశారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఆలయంలో అమ్మవారికి తొలుత అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తొలిపూజ చేశారు. అనంతరం పలువురు భక్తులు శాకంబరిగా కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు.

అమ్మవారికి చీర, సారె సమర్పణ

సఖినేటిపల్లి: అంతర్వేదిలో కొలువైన గుర్రాలక్క అమ్మవారికి అంతర్వేది దేవస్థానం తరఫున చీర, సారెను అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆదివారం సమర్పించారు. ప్రజలందరికీ సకల శుభాలు కలగజేయాలని అమ్మవారిని కోరుకున్నారు. వెంట సూపరింటెండెంట్ విజయ సారథి పాల్గొన్నారు.



శాకంబరిగా పళ్లాలమ్మ దర్శనం



అంతర్వేదిలో శాకంబరిగా దర్శనమిచ్చిన గుర్రాలక్క

ప్రతిభావంతులైన విద్యార్థులకు చేయూత



విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు చైర్మన్ రవీంద్రనాథ్

మామిడికుదురు: అవసరాల సీతారామారావు మెమోరియల్ ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ట్రస్టు ఆర్గనైజర్ అవసరాల శ్రీనివాస్ (యూఎస్‌ఏ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) పేర్కొన్నారు. సీతారామారావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈదరాడలో ఆదివారం డిగ్రీ, పీజీ, టెక్నికల్ కోర్సు చదువుతున్న 20 మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు రూ.1.50 లక్షల ఆర్థికసాయం అందించారు. ట్రస్టు చైర్మన్ మైలవరపు రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన సభలో యూఎస్‌ఏ నుంచి ట్రస్టు ఆర్గనైజర్ అవసరాల శ్రీనివాస్ వీడియో కెమెరా ద్వారా విద్యార్థులతో ముచ్చటించారు. తన తండ్రి సీతారామారావు పేరిట ట్రస్టు ఏర్పాటు చేసి 23 ఏళ్లు అయిందన్నారు. తమ ట్రస్టు అందిస్తున్న సహాయంతో విద్యార్థులు కష్టపడి చదువుకుని ఇతరులకు ప్రేరణగా నిలవాలన్నారు. తాను చిన్నతనంలో ఎంతో కష్టపడి చదువుకుని ప్రయోజకుడ్ని అయ్యానని చెప్పారు. అదే విధంగా విద్యార్థులు కూడా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జాలెం రాంబాబు, సిర్రా జగ్గారావు, పోతుమూడి రాజారత్నం, రాయుడు నాగేశ్వరరావు, కొలంక సత్యనారాయణ, శిష్టా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రోటరీ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

రాజోలు: రాజోలు రోటరీక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రోటరీ భవనంలో జరిగిన వేడుకల్లో రోటరీక్లబ్ అధ్యక్షుడిగా ఏడిద కవీంద్ర, కార్యదర్శిగా చిటీ్నడి లక్ష్మణరావు, కోశాధికారిగా లక్కింశెట్టి చిన్మయుడు, ప్రెసిడెంట్ ఎలక్ట్‌గా కాసు శ్రీనివాస్‌లతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులచే ఇన్‌స్టలేషన్ అధికారి, పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ డీవీఆర్ పూషా ప్రమాణస్వీకారం చేయించారు. ఇటీవల సివిల్స్ ఫలితాల్లో విజేతగా నిలిచిన యర్రంశెట్టి ఉమాలక్ష్మి రమణితో పాటు రోటరీ భోజనశాల నిర్మాణానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించిన శాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సోమిశెట్టి ఆంజనేయులును రోటరీ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్, దార్ల పెదబాబు, కసుకుర్తి రామకృష్ణ, బొరుసు వెంకట తిరుమలరావు, డాక్టర్ బసవా వరహాలు, నార్కెడిమిల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రోటరీ అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న నాయకులు

నాణ్యమైన బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటుకు కృషి

అంబాజీపేట: జాతీయ స్థాయిలో టోర్నీలు నిర్వహించే విధంగా బాస్కెట్ బాల్ కోర్టును స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో నాణ్యత ప్రమాణాలతో ఏర్పాటు చేసేందుకు తన వంతు కృషి చేస్తానని బాస్కెట్‌బాల్ జాతీయ క్రీడాకారుడు, పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్ కుమార్ అన్నారు. ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ పోటీలలో అంబాజీపేట, గంగలకుర్రు జెడ్పీ హైస్కూళ్లకు చెందిన సబ్ జూనియర్స్ బాలికలు మొదటి స్థానంలోను, బాలురు ద్వితీయస్థానంలో విజయం సాధించడంతో క్రీడాకారులు అభినందన సభను అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం క్రీడాకారులకు కప్‌లను ప్రదానం చేశారు. అలాగే అమలాపురానికి చెందిన మెట్రోకెమ్ అధినేత నందెపు వేంకటేశ్వరరావు సమకూర్చిన టీ షర్టులను 40 మంది క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ట్రెజరర్ సంసాని గంగాధరం, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, పీఈటీ రెడ్డిపల్లి దుర్గాప్రసాద్, అందె సూర్యకుమారి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్, ఆప్కా కమిటీ చైర్మన్ కామిశెట్టి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో బాస్కెట్‌బాల్ క్రీడాకారులతో సీఐ ప్రశాంత్‌కుమార్